# రికమెండేషన్ . . . . .

రచన :
యస్.ఆర్.రావు

పెళ్ళాం పోరు, మామగారి దెప్పులు, బావమరదుల హేళన ఆనందాన్ని కార్యశూరునిగా చేసేయి. ఉద్యోగం లభించనంతవరకు కొంపలో అడుగు పెట్టకూడదని నిర్ధారించుకొని, ప్రతి గుమాస్తాకి సలాంజేసి ఏ డిపార్టుమెంటులోనయినా వుంటే తెలియజేయుమని ప్రార్థేయపడ్డాడు.

సంరక్షణలేని చింపిరిజుట్టు, పాలిపోయిన గడ్డంతో ఊరల్లా, రోజంతా తిరిగి, బడలిక తీర్చుకొందామని ఆనాడు పార్కులో గడ్డి తివాసీమీద కూలబడ్డాడు. అతగాడి ఒక్కటే ఆలోచనా, ఉద్యోగ సంపాదనకి మార్గమేమిటని!

తోటి యువకులు కులాసాగా కబుర్లు చెప్పుకొంటుంటే అసూయ కలిగేది. అతనికి ఎదురుగా కూర్చున్న ఓ యువకుడు తన మిత్రుడితో 'జడ్జీ బెంచి దిగేడురా' అని కోర్టు భాషలో ఊసులాడుతూవుంటే ఆనందానికి చెప్పరాని ఆరాటం కల్గింది.

ఆ మిత్రద్వయానికి రెండు సిగరెట్లు ఇచ్చి తన ఆత్మకథ దీనంగా చెప్పాడు. ఫలితమేమిటంటే ఓ గుమాస్తాగిరీ జడ్జీ కోర్టులో ఖాళీగా వుందని తెలిసింది.

ఒక్కసారి కళ్ళు రెండూ పెద్దవిచేసి చిరునవ్వు నవ్వాడు. తనకా ఉద్యోగం కావచ్చునన్న ధీమా పుట్టుకొచ్చింది. ఉద్యోగరేఖ వుందన్న ప్రొద్దుటి జ్యోతిష్కుడికి అణాడబ్బులు ముట్టజెప్పలేకపోయినాను కదా అని విచారించాడు.

మరునాడు వర్జ్యంలేకుండా చూచి, దరఖాస్తు దాఖలుచేసి వస్తున్నాడు. మొహంమీద చిరునవ్వు తాండవమాడుతోంది. దుర్దినాలు పోయాయని భావించాడు. సత్యనారాయణవ్రతం జేసి జీవితంలో నూతన శకం ఆరంభిద్దామనుకొన్న ఆనందానికి ప్రక్కవాడి 'వెధవ ముప్పయిరాళ్ళ ఉద్యోగానికి ఎనభై దరఖాస్తులొచ్చాయిరా' అన్న పలుకులు ములుకుల్లా గుచ్చుకొన్నాయి.

ఆశ నిరాశ అయింది. ఉత్సాహమంతా మటుమాయమయింది. క్రొత్తగా మరో సంగతి తెలుసుకొన్నాడు. 'తనవంటి నిర్భాగ్యులు ఎనభైమందున్నారుట. వారందరికన్న తనేమీ రెండాకులు ఎక్కువ చదువుకోలేదే. అందరిలోనూ తనకే ఆ ఉద్యోగమవుతుందన్న మాటేమిటి?

ఈ క్రొత్త ఆలోచనలతో తిరిగి పార్కులో యథాస్థానంలో తథామిత్రద్వయం దగ్గర మేను వాల్చాడు.

'చదువు ముఖ్యంకాదురా' వారిలో ఒకతను లెక్చరు దంచుతున్నాడు. 'పలుకుబడి ముఖ్యం. పలుకుబడిగానీ ఉందంటే యిట్టే ఉద్యోగం సంపాదించవచ్చును. పలుకుబడి లేకపోయినా అథవా పలుకుబడి గలవానిచేత రికమెండు చేయించుకొంటే తుపాకిదెబ్బలాగా ఉద్యోగం అయి తీరుతుంది...'

శ్రద్ధగా సంభాషణ వింటోన్న ఆనందం పలుకుబడి వున్నవాళ్ళచేత రికమెండు చేయించుకొంటే ఉద్యోగమవుతుందని తెలుసుకున్నాడు. కాని తన దౌర్భాగ్యంకొద్దీ పలుకుబడిగల పెద్దలెవరితోనూ పరిచయములేదు తనకు......

రోడ్డుమీద పాతమిత్రుడు శంకరం కలిశాడు. 'ఒరేయి ఆనందం' అని పుట్టి మునిగినట్టు పిలిచాడు. జిడ్డోడుతున్న మొహంతో ఆనందం నిలబడ్డాడు. 'ఈ సంగతి విన్నావట్రా' అన్నాడు శంకరం.

'మనతో చదువుకొన్న కామాక్షి జడ్జీగారి భార్యాదేవి అయిందట......'

'ఎవరు ఎవరయితేనేం? ఆడవాళ్ళని గురించిన ఆలోచనలు యికనా మానరా?' అనుకొంటూ ఆనందం నడక సాగించాడు.

క్షణంలో ఆనందానికి ఓ వూహ తట్టింది. కామాక్షి చేతగానీ జడ్జీగారికి రికమెండు చేయించుకొంటే—ఏమో. అదృష్టం ఎలావుందో—కామాక్షి

చెప్తుందా, చెప్తే చెప్పొచ్చు. భార్యమాట జవదాటిన భర్త వున్నాడా ?

సంతోషంతో జడ్జీగారి బంగళాకి దారితీశాడు. జవానులని మచ్చికచేసుకొని శ్రీమతి జడ్జీగారికి యిష్టమయిన పువ్వులు, ఎక్కువగా సయించే తినుబండారాలూ ఏమిటేమిటో తెలుసుకున్నాడు.

కాబూలీవాలాదగ్గర ఓ పదిరూపాయలు అప్పు చేసి, అవన్నీ కొని తీసుకుని జడ్జీగారి బంగళాకెళ్ళి కబురందించాడు.

జవాను చెప్పాడు: "అమ్మగారు హాల్లో కూర్చోమన్నా"రని. ఆనందం కుషన్‌లో కూలబడ్డాడు. ఆవిడ ముందర ఎలా నటించాలో మనసులో రిహార్సల్ జేసుకొన్నాడు.

తనకే ఉద్యోగం లేదనీ, పిల్లలుగలవాడనీ, స్కూలుస్నేహాన్ని గురించి భర్తకి గట్టిగా రికమెండు చేయమని—ఆమె పేరున, తనూ, పిల్లలు యింతకూడుతింటామని—యింకా ఏవేవో ఊహిస్తున్న ఆనందం జడ్జీగారి భార్యరాక గమనించాడు—

త్రుళ్ళిపడ్డాడు. నమస్కారం బాణం ప్రయోగించి రికమెండు చేయమని పదేపదే పలవరిస్తున్నాడు—

ఆమె ఆనందాన్ని చూచింది. పెదవుల మీది మునుపటి చిరునవ్వు మాయమయింది. చీదరింపు మొహంతో 'చాలించు లెక్చరు' అంది.

ఆమె ముఖకళ కనిపెట్టని ఆనందం, ఆమెదగ్గర కొస్తుంటే కరస్పర్శ చేయడానికి కాబోలు అని భావించి తన చేయి చాపాడు—

ఆమె అతని కరస్పర్శను నిరాకరిస్తూ—'రికమెండు చేయాలట ! ముష్టి మొహానికి ఉద్యోగం ఎందుకో ? మరచిపోయాననుకొన్నా వేమిటి ? మనం చదువుకునే రోజుల్లో నువ్వు, ఆ శంకరంగాడూ నన్ను, గాజుబొమ్మ అనీ; బిబ్బో అనీ పేర్లుపెట్టి నన్ను ఏడిపించేవారు. రికమెండు చేయాలట—ఇదుగో రికమెండు చేస్తున్నా—"అప్పలస్వామీ—ఈ రౌడీ-వెధవని గెంటేయి" అని త్రాచులాగ బుసకొడుతూ మాయమయింది.

'నడయ్యా ! నడు. పెద్దమనిషిలా నుంచున్నావూ' అని ఆనందం కోటుకాలరుమీదికి చేయిని పోనిచ్చాడు అప్పలస్వామి.



# యింతలో యింత ఆరోగ్యం!

"మొన్నటికి ముఖమంతా పాలిపోయి వాలవేశావ్. ఇంతలోయింతఆరోగ్యం! అది యెలా సాధ్యం?"

"అదే చెప్పుకో!"

"ఇదివరకు నే చెప్పినమందా?"

"కాదు"—

"ఏదైనా ఇంగ్లీషుమందా?"

"కా—దు"

"యూనానీయా?"

"కా———దు"

"మరి—?"

"లోధ్ర. పొరిగింటావిడ యిచ్చింది. పుచ్చుకున్నాను నాలుగు మోతాదులు. దాన్తో కడుపునొప్పి ముట్టుకుట్టు అదంతా మాయమైపోయింది.

గర్భాశయ రోగములను పారద్రోలి ఆరోగ్యముప్రసాదింపగలది "లోధ్ర"

కేసరికుటీరంలిమిటెడ్ - రాయపేట-మద్రాసు